భేషుగ్గా.. సీసీ రోడ్లు

నాడు

ఏవో కొన్ని ప్రధాన జంక్షన్లలో మాత్రం కొత్త రోడ్లు నిర్మించేవారు. కాలనీల్లోని రోడ్లు ఏళ్ల తరబడి ఎలాంటి అభివృద్ధి లేకుండా ఉండేవి. వర్షం వస్తే ఆయా ప్రాంతాలు శిథిల రోడ్ల వలన చెత్త చెదారంతో నిండిపోయేవి. గుంతల రోడ్ల వల్ల మురుగు రోడ్ల మీదే నిలిచిపోయేది. దుర్గంధం, దోమలు వ్యాపించి ప్రజలు వ్యాధుల బారిన పడేవారు.

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి

అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రజలకు సంపూర్ణంగా అభివృద్ధినందిస్తూ అనేక సంస్కరణలు చేపట్టారు. పేదల అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారు. విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రజలు ఎలాంటి సమస్యలు లేకుండా జీవించేందుకు తన వంతు భరోసా కల్పిస్తున్నారు.

నేడు

ప్రధాన జంక్షన్లు, ప్రాంతాల్లోని రోడ్లతో పాటు చిన్నచిన్న కాలనీల్లోని సీసీ రోడ్ల నిర్మాణానికి కూడా అధిక ప్రాధాన్యతనిస్తూ కోట్లాది రూపాయల నిధులు కేటాయిస్తున్నారు. దీంతో సాధారణ నివాస ప్రాంతాల్లోని సీసీ రోడ్లు మహర్దశ సంతరించుకుంటున్నాయి. చక్కటి రోడ్ల నిర్మాణం వల్ల ఆ ప్రాంతాలు పరిశుభ్రంగా కనిపిస్తున్నాయి. మురుగు, చెత్త సమస్య లేకుండా స్థానికులు ప్రశాంతంగా జీవిస్తున్నారు.



విశాలంగా రూపుదిద్దుకున్న పోర్టు బేసిక్ పాఠశాల సందు

- రూ. 20 లక్షలతో 130 మీటర్ల పొడవున అరటిపండ్ల సందు సీసీ రోడ్డు నిర్మాణం
- రూ. 20 లక్షలతో 160 మీటర్ల పొడవున వెలంపేట వద్ద సీసీ రోడ్డు నిర్మాణం
- రూ. 17 లక్షలతో 133 మీటర్ల పొడవున మౌలాలీ పంజా సీసీ రోడ్డు నిర్మాణం
- రూ. 40 లక్షలతో 300 మీటర్ల పొడవున చాగంటి వారి వీధిలో సీసీ రోడ్డు నిర్మాణం
- రూ.34 లక్షలతో 160 మీటర్ల పొడవున అంబుసారంగ వీధిలో సీసీ రోడ్డు నిర్మాణం
- రూ . 40 లక్షలతో 250 మీటర్ల పొడవున కోటవీధి దరి కర్రిదానప్ప వీధిలో సీసీ రోడ్డు నిర్మాణం
- రూ. 10 లక్షలతో 70 మీటర్ల పొడవున అంబుసారంగ వీధి నుంచి పోర్టు బేసిక్ స్కూల్ సందు వరకు సీసీ రోడ్డు నిర్మాణం



పూర్ణామార్కెట్‌లోని అరటి పండ్ల సందు నాడు



పూర్ణామార్కెట్‌లోని అరటిపండ్ల సందు నేడు



- ప్రధాన కూడళ్లతో పాటు చిన్నచిన్న కాలనీలకు ప్రాధాన్యం
- నివాస ప్రాంతాల్లో రహదారుల మెరుగుతో స్థానికుల్లో ఆనందం
- మడమ తిప్పని నాయకుడు సీఎం జగనన్న అని ప్రజల హర్షం

జగదాంబ : సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా సీఎం జగనన్న పాలన సాగిస్తున్నారు. అందులో భాగంగా ప్రధాన రహదారులు, జంక్షన్లు అభివృద్ధి చేస్తూ చిన్నచిన్న కాలనీల్లో ఉండే సీసీ రోడ్ల అభివృద్ధికి సైతం నిధులు కేటాయిస్తూ అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందేలా కృషి చేస్తున్నారు. దీనిలో భాగంగా పాతనగరంలోని జీవీఎంసీ 35, 39 వార్డుల్లో గల అరటిపండ్ల సందు, వెలంపేట, మౌలాలీపంజా, అంబుసారంగ వీధి, కోటవీధిలోని కర్రిదానప్ప వీధి, పోర్టు ప్రాంతానికి చెందిన ఏరియాల్లో గల సీసీ రోడ్లను కోట్లాది రూపాయల వ్యయంతో నూతనంగా తీర్చిదిద్ది ప్రజలతో శభాష్ అనిపించుకుంటున్నారు.

మేలు చేసిన గడప గడపకు మన ప్రభుత్వం..

కాలనీల్లోని సమస్యలు తెలుసుకోవడానికి, ప్రజల బాధలు అర్థం చేసుకోవడానికి నాయకులకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం నాయకులు తమ పరిధిలోని అన్ని ప్రాంతాలను సందర్శించారు. అక్కడి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో తాగునీరు, కాలువలు, సీసీ రోడ్లు కావాలని ప్రజలు నాయకులకు విన్నవించుకున్నారు. ఫలితంగా ఎక్కడ ఏ సమస్యలు ఉన్నాయో తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నారు.

తొమ్మిదేళ్ల తర్వాత..

పాతనగరంలోని చాలా చోట్ల సీసీ రోడ్లు శిథిలమైపోయాయి. గత ప్రభుత్వం తొమ్మిదేళ్ల కాలంలో కనీసం మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో స్థానికులు ఇబ్బందుల మధ్యే గడపాల్సి వచ్చేది. నడవడానికి కూడా వీల్లేకుండా ఉండేది. అయితే జగనన్న ప్రభుత్వం వచ్చాక అన్ని వీధులు, చిన్న చిన్న సందులతో సహా కొత్త రోడ్లు, సీసీ రోడ్ల నిర్మాణంతో నివాస ప్రాంతాలు ఇప్పుడు కళకళలాడుతున్నాయి.



అంబుసారంగ వీధిలో నిర్మాణం జరిగిన సీసీరోడ్డు

ఇప్పుడు నడవగలుగుతున్నాం..



అరటిపండ్ల సందులో గతంలో నడవడానికి కూడా వీల్లేకుండా ఉండేది. రోడ్డంతా గతుకులతో ఉండి వాహన చోదకులు, పాదచారులు కూడా ఇబ్బంది పడేవారు. జగనన్న ప్రభుత్వం ఇప్పుడు రోడ్డు వేయడంతో రహదారి బాగుపడింది. వినియోగదారులు, వ్యాపారులకు అనుకూలంగా ఉంది.

–రాజుబాబు, పూర్ణామార్కెట్ ఏరియా

మడమ తిప్పని నాయకుడు జగనన్న..



గడప గడపకు మన ప్రభుత్వంలో సమస్యలు గుర్తించి పరిష్కరిస్తాం అని నాయకులు చెప్పినా మొదట్లో నమ్మలేదు. కానీ జగనన్న ప్రభుత్వం అనుకున్న దానికి భిన్నంగా కాలనీల్లోని సమస్యలు గుర్తించి పరిష్కరించింది. అందుకే జగనన్న మడమ తిప్పని నాయకుడని అన్నారు.

–అబ్దుల్ బిలాల్, అంబుసారంగ వీధి

పాతనగరంలో కొత్తరోడ్లు..



పాతనగరం అంటేనే గతంలో జనం హడలిపోయేవారు. అటువంటిది ఇప్పుడు ప్రధాన రహదారులతో పాటు వీధుల్లో కూడా సీసీ రోడ్లు నిర్మించారు. దీంతో ఎన్నో ఏళ్ల సమస్యకు పరిష్కారం చూపినట్లు అయింది. ఇప్పుడు వీధులు బాగున్నాయి.

–బుఖారీ, అంబుసారంగ వీధి

ఇదే అభివృద్ధి అంటే..



వైఎస్సార్‌సీపీ అభివృద్ధి చేసే ప్రభుత్వం. ప్రధాన రహదారుల నుంచి వీధుల్లో ఉండే చిన్న రహదారుల వరకు అన్నింటినీ నిర్మించి అభివృద్ధి చేసే ప్రభుత్వం అని నిరూపించారు. సంక్షేమం, అభివృద్ధి సమానంగా చేస్తున్నారు.

–గోవిందరావు, రెల్లివీధి



వెలంపేట దరి పూలసందులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ విల్లూరి

క్లుప్తంగా

పోర్టు రహదారిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఏడీసీపీ శ్రీనివాసరావు

జగదాంబ : భద్రతా కారణాల దృష్ట్యా పోర్టు రహదారుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఏడీసీపీ జి.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం హార్బర్ స్టేషన్‌లో పోర్టు యాజమాన్యం, కాంట్రాక్టర్లు, ట్రాఫిక్, ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్, లారీ డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. పోర్టు ఏరియాలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో రహదారుల భద్రత దృష్ట్యా మారుతీ సర్కిల్ నుంచి పోర్టు వరకు లైట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. డ్రైవర్లు నెమ్మదిగా లారీలు నడపాలన్నారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్, సీఐ తులసీదాస్, లా అండ్ ఆర్డర్ సీఐ నరసింహారావు, పోర్టుట్రస్ట్ ట్రాఫిక్ మేనేజర్, కాంట్రాక్టర్, లారీ యజమానులు, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

2న మెగా జాబ్‌మేళా



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

దాబాగార్డెన్స్ : జేడీ ఫౌండేషన్, నిపుణ హ్యూమన్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో డిసెంబర్ 2న మధురవాడ క్రికెట్ స్టేడియం వెనుక గల సాంకేతిక ఇంజినీరింగ్ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నటుట సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జేడీ ఫౌండేషన్ కన్వీనర్ ప్రియాంక దండి, కృష్ణమోహన్, నిశ్చల్, నాగరాజు, సాంకేతిక కాలేజీ ప్రతినిధి కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళకు రక్షణ



నిరాశ్రయ వసతి గృహంలో మహిళ

అల్లిపురం : మద్యానికి బానిసై ఇల్లు వదిలి నగరానికి వచ్చి రోడ్డుపై తిరుగుతున్న మహిళకు జీవీఎంసీ ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహం ఆశ్రయం కల్పించింది. విజయనగరం జిల్లా, బొబ్బిలి దరి పిరిడి గ్రామానికి చెందిన వి.ఈశ్వరమ్మ టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి కొబ్బరితోటలో మద్యం మత్తులో తిరుగుతుండగా టూటౌన్ పోలీసులు ఆమెను తీసుకు వచ్చి ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహానికి అప్పగించారు. అక్కడి సిబ్బంది ఆమెకు షెల్టర్ ఏర్పాటు చేసి వైద్యం అందజేయటంతో 17 రోజుల్లో కోలుకుంది. దీంతో ఆమెను మంగళవారం సాయంత్రం బొబ్బిలి పంపించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. ఆమె ఇంటికి చేరుకున్న తర్వాత ఫోన్ చేసి కుటుంబ సభ్యులతో కలిసి ధన్యవాదాలు తెలిపినట్లు చెప్పారు.

సంక్షేమం కొనసాగాలంటే జగనే మళ్లీ సీఎం కావాలి



స్ప్రింగ్‌రోడ్డులో ప్రజలకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న కార్పొరేటర్ విల్లూరి

జగదాంబ : ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం జీవీఎంసీ 35వ వార్డులో కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ఈ నేపథ్యంలో స్ప్రింగ్‌రోడ్డులో ఇంటింటికీ వెళ్లి అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు వివరించారు. ప్రజలు కూడా జగనన్న సర్కార్ వల్ల తాము పొందిన లబ్ధిని వివరించినట్లు కార్పొరేటర్ తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ జగనే సీఎం కావాలని ప్రజలు కోరుతున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి నీలకంఠం, వార్డు నాయకులు గౌరీశంకర్, సచివాలయ సిబ్బంది, గృహసారథులు, కన్వీనర్ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీతల వాసు

29వ వార్డులో..

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ 29వ వార్డులో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. నియోజకవర్గ మండల అధ్యక్షుడు పీతల వాసు కనకదుర్గా నర్సింగ్ హోం ప్రాంతంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. 2024 ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కావడం, ఎమ్మెల్యేగా వాసుపల్లి గెలవడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. పచ్చిరపల్లి రాము, బుల్లెట్ రవి, కోరాడ సురేష్, బెవర మహేష్, రమణ, తమ్మినేని శ్రీను, యలమంచిలి సంతోష్, గొలగాని సతీష్, కనకల రాజు, మజ్జి అప్పలరాజు, తిరుమలరావు, సాయి, ఆర్పీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

పోరుబాటే నండూరికి నిజమైన నివాళి



నండూరికి నివాళులర్పిస్తున్న సిటు నాయకులు

దాబాగార్డెన్స్ : ప్రభుత్వ రంగ పరిశ్రమలు, కార్మిక హక్కులు రక్షించుకోవడం కోసం ఉధృతమైన పోరాటాలు నిర్వహించడమే నండూరి ప్రసాదరావుకు నిజమైన నివాళి అని సిటు జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి అజశర్మ పేర్కొన్నారు. నండూరి ప్రసాదరావు 22వ వర్ధంతి బుధవారం సిటు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిటు నాయకులు వీఎస్ పద్మనాభరాజు, అజశర్మ, ఆర్‌కేఎస్‌వీ కుమార్ తదితరులు పాల్గొని నండూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిటు నాయకులు జ్యోతీశ్వరరావు, వై. రాజు, ఎం. సుబ్బారావు, అప్పలరాజు, పోలేశ్వరరావు, కేవీ చంద్రమౌళి, వెంకట్రావు, సూరీడు, నరసింగరావు, అప్పారావు, శివ, కుమారి, భారతి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి



యువతనుద్దేశించి మాట్లాడుతున్న మేయర్ హరి వెంకటకుమారి

దాబాగార్డెన్స్ : మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పిలుపునిచ్చారు. హిమా హ్యూమానిటేరియన్ స్వచ్ఛంద సేవా సంస్థ, సింహాద్రి టీఎంటీ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిరోధంపై చేపట్టిన దక్షిణ భారతదేశ కారు అవగాహన యాత్రను మేయర్ బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిరోధంపై అవగాహన శిబిరాలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. సరదాల కోసం, స్నేహితుల ప్రోద్బలంతో, చెడు అలవాట్ల ప్రభావంతో మాదకద్రవ్యాల అలవాట్లకు గురవుతున్నారని, ఈ చెడు అలవాట్లు పిల్లల భవిష్యత్‌ను సర్వనాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యువత సన్మార్గంలో నడవాలని హితవు పలికారు. రిటైర్డ్ జడ్జి పైలా సన్నిబాబు మాట్లాడుతూ డ్రగ్స్ కోసం యువత నేరాలకు పాల్పడుతున్నారని, స్కూల్, కళాశాలలకు మాదకద్రవ్యాలు ప్రాకడం దురదృష్టకరమన్నారు. హిమా చైర్మన్ బీఎస్ మూర్తి, అధ్యక్షుడు శరగడం సురేష్, బీసీ సంఘం నాయకుడు నరవ రాంబాబు మాట్లాడుతూ 25 రోజుల పాటు ఈ ర్యాలీ దక్షిణ భారతదేశంలోని ఐదు రాష్ట్రాల్లో సాగనుందని, దారి పొడవునా కళాశాల విద్యార్థులకు ఆయా భాషల్లో ముద్రించిన కరపత్రాలు పంపిణీ చేసి మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తామన్నారు. కార్యక్రమంలో ఒరిస్సా స్టీవ్‌డోర్స్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ జేకే నాయక్, బీవీకే కాలేజీ కరస్పాండెంట్ వై. శ్రీధర్, ప్రిన్సిపాల్ డీవీఎల్ఎన్ జోగిరాజు పాల్గొనగా, ర్యాలీలో హిమా సంస్థ వ్యవస్థాపకుడు, జనరల్ సెక్రటరీ టీవీడీ దాస్, సభ్యులు బీఎస్ నంద, ఎం. కాశీవిశ్వనాథ్, ఎస్‌కే ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధాలయంలో సేవా కార్యక్రమాలు



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న అతిథులు

కంచరపాలెం: కంచరపాలెం అశోక్‌నగర్‌లోని బౌద్ధాలయంలో ఆంధ్ర బౌద్ధ కేంద్ర సమాజం ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్ ఆధ్వర్యంలో బుధవారం ఆంధ్ర–బర్మా బౌద్ధ మహిళా మండలి అధ్యక్షురాలు ఎం.పన్నీరమ్మ 17వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి కార్పొరేటర్ కె.వి.ఎన్.శశికళ చేతుల మీదుగా పేద మహిళలకు చీరల పంపిణీ, అన్నదానం చేశారు. ముందుగా బుద్ధుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పన్నీరమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఆమె సేవలను కొనియాడారు. ఉచిత కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు శశికళ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎ.ఎం.ఫ్రెడ్డీ, సిహెచ్.బాబూరావు, సూర్యారావు, జి.రాజు, భీమారావు, పి.అప్పారావు, సునీల్ బర్మా క్యాంప్ సభ్యులు పాల్గొన్నారు.

త్రిపురాంతకస్వామికి 108 కలశాలతో అభిషేకం



గంగధార నుంచి ప్రధాన కలశం తీసుకొస్తున్న అర్చకుడు రమణమూర్తి, ఈవో శ్రీనివాసమూర్తి



త్రిపురాంతకస్వామికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: సింహగిరి క్షేత్రపాలకుడు త్రిపురాంతక స్వామి ఆలయంలో చేపట్టిన వరుణ జపయాగంలో భాగంగా మూడోరోజు బుధవారం స్వామికి అష్టోత్తర శత కలశాభిషేకం ఘనంగా నిర్వహించారు. స్వామి సన్నిధిలో ఉదయం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం జరిపి అనంతరం వైదికులు గంగధారకు వెళ్లి కలశాలతో జలాలు తీసుకొచ్చి స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకం చేశారు. అనంతరం ఆలయ అర్చకుడు వి.రమణమూర్తి గంగా జలాలతో స్వామిని అభిషేకించి విశేషంగా హారతులు అందజేశారు. దేవస్థానం వేద పండితుడు కాళ్ల కూరి సుబ్రహ్మణ్యేశ్వరశర్మ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, ట్రస్ట్ బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, ఈఈ రాంబాబు, డీఈ నాగేశ్వరరావు, ఏఈవోలు నరసింహరాజు, పాలూరి నరసింగరావు, సీనియర్ అసిస్టెంట్ వరహాలరావు, పీఆర్వో నాయుడు పాల్గొన్నారు.

అలరించిన జానపద నృత్యాలు



ఆకట్టుకున్న జానపద నృత్యాలు

మహారాణిపేట : విశాలాంధ్ర పుస్తక మహోత్సవం జరుగుతున్న టర్నర్ సత్రం ప్రాంగణంలో బుధవారం సాయంత్రం నవ చైతన్య కళా మండలి ఆధ్వర్యంలో ప్రదర్శించిన జానపద కళారూపాలు అలరించాయి. క్రియేటివ్ కామెడీ క్లబ్, అరసం సంయుక్త నిర్వహణలో ఏర్పాటు చేసిన జానపద గీతాలు, నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఆదరణ కోల్పోతున్న కళాకారులను వెలుగులోకి తీసుకురావడానికి ఇలాంటి ప్రదర్శనలు దోహదపడతాయని వక్తలన్నారు. ఈ కార్యక్రమంలో అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, ఎస్. చిన్నారెడ్డి, పిల్లి వీర్రాజు, వి.ప్రభాకర్, రాజు, మెలోడీ సత్యనారాయణ, మేడా మస్తాన్‌రెడ్డి, విశాలాంధ్ర బుక్‌హౌస్ మేనేజర్ పి.ఎ.రాజు పాల్గొన్నారు.

వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్‌కు కంప్యూటర్ వితరణ



కంప్యూటర్‌ను ప్రారంభిస్తున్న ఇన్నర్ వీల్ క్లబ్ చైర్‌పర్సన్ శ్రీదేవి తదితరులు

అల్లిపురం : వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్‌కు ఇన్నర్ వీల్ డిస్ట్రిక్ట్ 3020 చైర్‌పర్సన్ శ్రీదేవి కంప్యూటర్ అందజేశారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆమెతో పాటు క్లబ్ అధ్యక్షురాలు బిమ్మి బాల, కార్యదర్శి జి.విజయలక్ష్మి, మాజీ చైర్‌పర్సన్ కస్తూరిరెడ్డి, డాక్టర్ అనుపమ, కోశాధికారి రమాదేవి, ఉపాధ్యక్షురాలు రమా విద్యాసాగర్ పాల్గొన్నారు. వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ సభ్యులు ఎ.మణి దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

ఆచార్య రంగథామారావు స్మారకోపన్యాసం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మంగళవారం ఆచార్య కె.రంగథామారావు స్మారక ప్రసంగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏయూ ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఇటువంటి స్మారక ప్రసంగాల వల్ల ప్రముఖుల జీవితాలు, పరిశోధన రంగంలో వారు అందించిన సేవలను తెలుసుకునే అవకాశం యువతకు కలుగుతుందన్నారు. ఆచార్య రంగథామారావు జీవిత విశేషాలను నేటితరం యువత తెలుసుకుని, స్ఫూర్తిని పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏయూ మాజీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు, విశ్రాంత ఆచార్యులు సి.శాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.